రీ సర్వేతో రైతులకు మేలు : జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్

విశాలాంధ్ర- పార్వతీపురం రూరల్ : ప్రభుత్వం చేపడుతున్న రీ సర్వేతో భూ సమస్యలు తొలగి రైతులకు భూ యజమానులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. రెండవ విడత రీ సర్వే కార్యక్రమంలో భాగంగా మండలంలోని తాళ్ల బురిడీ గ్రామంలో నిర్వహిస్తున్న రీ సర్వే ప్రక్రియను మంగళ వారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సర్వే జరిపే ముందు రైతులకు నోటీసులు జారీ చేసి గ్రామంలో రైతుల భూములతోపాటు గ్రామ సరిహద్దులు, నీటి వనరుల భూములు, పోరంబోకు భూములను కొలతలువేసి ఖచ్చితమైన సరిహద్దులను ఏర్పాటు చేస్తారన్నారు. తద్వారా రైతులకు, భూ యజమానులకు శాశ్వత మేలు జరుగుతుందని పేర్కొన్నారు. రైతుల సమక్షంలోనే భూమి కొలతలు కొలిచి మీ భూమికి హద్దులు నిర్ణయిస్తారని తెలిపారు. రైతులతో ముఖాముఖి నిర్వహించి రి సర్వే జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వేలో తప్పులు దొర్లకుండా పక్కాగా నిర్వహించాలన్నారు. రైతులకు నోటీసులు జారీ చేస్తున్నది లేనిది రైతులకు అడిగి ఆరా తీశారు,ఇప్పటివరకు ఎంత మేర సర్వే నిర్వహించినట్లు తాసిల్దార్ వై.జయ లక్ష్మి ను ప్రశ్నించగా 1147 ఎకరాల గ్రౌండ్ ట్రూటింగ్ పూర్తి కాగా మిగతతా 31 ఎకరాలు సర్వే నిర్వహించాల్సి ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరణించిన భూ యజమానుల వారసులకు మార్పు చేసే విధంగా ఎఫ్ఎంసి విచారణ పూర్తి చేసి మ్యూటేషన్ లను పరిష్కరించాలని ఆదేశించారు. భూ సమస్యలు తలెత్త కూడదనేది రీ సర్వే ఉద్దేశమని, రైతులు పక్కా భూ రిజిస్ట్రేషన్లు చేసుకొనేలా ప్రోత్సహించాలని సూచించారు. రోడ్లుకు కేటాయించిన భూములలో హద్దులు నిర్ణయించి రక్షణ కల్పించాలన్నారు. చెరువులు, వాగులలోని ఆక్రమణలు ఉంటే తొలగించాలని సూచించారు. సర్వే ప్రక్రియ జరిగిన తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్వే, భూ రికార్డుల నిర్వహణ శాఖ సహాయ సంచాలకులు లక్ష్మణ రావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ జి.రవి తేజ, మండల సర్వేయర్ స్వామి, గ్రామ సర్వేయర్ నాయుడు, గ్రామ సచివాలయ సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

లక్ష సాధన త్వరగా పూర్తి చేయాలి

విశాలాంధ్ర - పార్వతీపురం రూరల్ : సంఘాలు, సభ్యులు, గ్రామ సంఘాలు, మండల సంఘాలు యొక్క పూర్తి వివరాలు ఈనెల 25వ తేదీలోగా లోకోస్ యాప్ లో పొందుపరిచి ఆయా సంఘాల బలోపేతానికి దోహదపడాలని రీసర్చ్ పర్సన్ సత్యనారాయణ అన్నారు. దీనికి సంబంధించి స్థానిక మండల సమీక్ష కార్యాలయంలో మంగళవారం ఏపిఎం బలగ సన్నీ బాబు ఆధ్వర్యంలో లోకోస్ యాప్ పై అవగాహన కల్పించి ఆన్లైన్ చేసే విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాల యొక్క వివరాలతో పాటు అందులో గల మహిళ లెక్క పూర్తి వివరాలను లోకోస్ యాప్ లో భద్రపరచాలని ముఖ్యంగా (ఎన్. ఆర్ .ఎల్. ఎం) జాతీయ జీవన్ ఉపాధి మిషన్ ద్వారా పూర్తి వివరాలను పొందు పరచాలని వివోఏలకు సూచించారు ఇప్పటి వరకు మండలానికి సంబంధించి 1562 గ్రామీక సంఘాలకు గాను సుమారు 17 వేల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారని ఇందులో 150 సంఘాల వివ రాలు తోపాటు 2600 మంది మహిళల పూర్తి వివరాలు ఆన్లైన్లో నమోదు చేయాల్సిన అవసరం ఉంద న్నారు. అయ్యా సంఘాల యొక్క వివరాలు త్వరగా పూర్తి చేసి సతశాతం లక్ష్యసా ధన చేయాలని ఆదే శించారు. ఏపిఎం (బ్యాంక్) శివ నాయుడు ఐబీఐపీఎం సింహాచలం సీసీలు ఏపిఎం వివోఏలు పాల్గొన్నారు.

స్వర్ణ ఆంధ్రా - స్వచ్ఛ ఆంధ్ర

విశాలాంధ్ర - పార్వతీపురం : వచ్చే మూడవ శనివారం స్వర్ణ ఆంధ్రా - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం జిల్లాలో పెద్ద ఎత్తున చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళ వారం వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వేసవి వడగాలుల దృష్ట్యా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలపై ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వచ్చే మూడవ శనివారం స్వచ్ఛ కార్యక్రమంలో భాగంగా "బీట్ ద హీట్" థీమ్ తో వేసవి దృష్ట్యా వడ గాల్పులు, బారిన పడకుండా తీసుకో వాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలు ప్రజ లందరికీ వివరించాలన్నారు. వడ గాల్పుల వలన ఏ ఒక్కరూ అనారోగ్యం బారిన పడకూడదని ఆయన స్పష్టం చేశారు. గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల మహిళలు, ఉపాధి హామీ శ్రామికులు, గ్రామపంచాయతీల పారిశుధ్య కార్మికులు తదితరులతో సమావేశం నిర్వహించి వారికి వేసవి దృష్ట్యా తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలు వివరించాలన్నారు. వారు చేయవలసిన పనులు చేయకూడని పనులు ఏమిటో స్పష్టంగా తెలియజేయాలన్నారు. పిల్లలు, వయోవృద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అన్ని గ్రామాలు, పట్టణాల్లోనూ ముఖ్యమైన ప్రదేశాలలో చలివేంద్రాలను నిరంతరం నడపాలన్నారు. వాతావరణ హెచ్చరికలు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అన్నారు. వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ ప్రకటించిందని, రెవెన్యూ, సంబంధిత అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలని ఆయన ఆదేశించారు. వేసవి తీవ్రత, అకాల వర్షాలు, ఈదురు గాలుల పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలని ఆయన చెప్పారు.

జాబ్‌మేళాలో 80 మంది ఎంపిక

విశాలాంధ్ర - సాలూరు : పట్టణంలో ఉన్న స్థానిక ఐటిఐ కళాశాలలో ఏర్పాటు చేసిన జాబ్‌మేళా కు మంచి స్పందన లభించింది.జాబ్ మేళాలో 80 మంది నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశం లభించిందని స్థానిక ఐటిఐ ఇంఛార్జి ప్రిన్సిపాల్ కోట్ల శ్రీనివాసరావు తెలిపారు. జాబ్ మేళాకు 216 మంది నిరుద్యోగ యువత హాజరయ్యారన్నారు.ఇందులో 80 మందికి ఉద్యోగ అవకాశం లభించిందన్నారు. ఆన్‌రోల్ ఉద్యోగానికి 50 మంది ఎంపిక కాగా, అప్రెంటీస్ కి 30 మంది ఎంపిక అయ్యారన్నారు.ఎంపిక అయిన వారికి కంపెనీ యాజమాన్యం నుండి 13500/ మరియు ప్రభుత్వం నుండి నేరుగా 1500 కలిపి మొత్తం 15000 రూపాయలు అప్రెంటీస్ విద్యార్థులకు స్టైఫండ్ రూపంలో చెల్లిస్తారని తెలిపారు. ఆన్‌రోల్‌లో ఎంపిక అయిన వారికి నెలకు 15000 రూ.కంపెనీ నుండి జీతం చెల్లిస్తా రన్నారు. పాటిల్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్స్, కోరమండల్ (పాటిల్ గ్రూప్)కొవ్వూరు సంస్థల ప్రతినిధులు, నిరుద్యోగ యువత హాజరయ్యారు.

బాలికల హక్కులు మరియు పరిరక్షణ భరోసా.. కిశోరీ వికాసం

విశాలాంధ్ర - బలిజిపేట : ఈరోజు బలిజిపేట మండలం లో బలిజిపేట గ్రామం మరియు పెదపెంకి గ్రామం కిషోర్ వికాసం సమ్మర్ ప్రోగ్రాం ముఖ్య అతిథిగా బలిజిపేట ప్రాజెక్టు - సిడిపిఓ ఎస్. సులేఖ హాజరవ్వడం జరిగింది. బలిజిపేట పాజెక్ట్ సిడిపిఓ ఎస్. సులేఖ మాట్లాడుతూ సమాజంలో బాలికలను వెంటాడుతున్న లింగ వివక్ష, సైబర్ నేరాలు, ఆహార లోపం, అనారోగ్యం, బాల్య వివా హాలు, లైంగిక వేధింపులు, అక్రమ రవాణాను సమూలంగా అరికట్టడంతోపాటు భవితకు భరోసా కల్పించాలని బలిజిపేట ప్రాజెక్ట్ మహిళా శిశు సంక్షేమ అభివృద్ధి అధికారిణి -ఎస్. సులేఖ ఆధ్వర్యంలో కిశోరీ వికాసం వేసవి సెలవుల స్పెషల్ క్యాంపెయిన్ సెషన్ - 4 .ఆమె మాట్లాడుతూ బాలల హక్కులు అవగాహన మరియు బాలికల రక్షణ మరియు చట్టంలో ఉన్న చెడు స్పర్శ మరియు మంచి స్పర్శ గూర్చి బలిజి పేట మరియు సీతానగరం మండలాల్లో అవగాహన సెషన్స్ వివరించడం, బాల బాలికల రక్షణ మరియు ఏ విధంగా పరిరక్షించాలన్న విషయంలో ప్రతి సచివాలయంలో కూడా ఈరోజు మహిళా సంరక్షణ అధికారులు అవేర్నెస్ ప్రోగ్రాం సెషన్స్ చెప్పడం జరుగుతుంది అన్నారు.జూన్ నెల 10వ తేదీ వరకు బాలికలకు వికాసం చెందాలంటే ఆడపిల్లలకు ఈ సెషన్స్ లో వారి యొక్క హక్కులు అవగాహన మరియు ఆడపిల్లలు సాధికారికత ముఖ్యమని అన్నారు, ఈ బాలికల వికాస్ కార్యక్రమాలు బలిజిపేట ప్రాజెక్ట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బాలల లీగల్ ప్రొబేషన్ ఆఫీసర్ - పి. శ్రీధర్, కిరణ్మయి, హెల్త్ సూపర్వైజర్స్, హరి కృష్ణ, సచివాలయం మహిళా సంరక్షణ అధికారులు, ఎస్. శ్రీ వాణి, జి. కృష్ణవేణి,ఆరోగ్య కార్యకర్తలు, గ్రామ మహిళ సమైక్య సంఘ అధ్యక్షులు, అంగన్వాడి టీచర్స్ పాల్గొన్నారు.

పాలకొండలో విజయ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్లో అరుదైన చికిత్స

విశాలాంధ్ర - వీరఘట్టం : పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ లో నెలలు నిండకుండా పుట్టిన 900 గ్రాముల ప్రీ మెచూర్ బేబీకి విజయవంతంగా డెలివరీ చేసారు. పాలకొండలోని విజయ మల్టీస్పెషలిటీ ఆసుపత్రి సిబ్బంది, రేగిడి ఆమదాలవలస మండ లానికి చెందిన లక్ష్మి అనే 7వ నెల గర్భిణీ. వేరే హాస్పిటల్‌లో చెకప్ అనంతరం కడుపులోని బేబీని అబార్షన్ చెయ్యాలని లేదంటే తల్లికి, బిడ్డకి ప్రాణాపాయం అని చెప్పడంతో విజయ హాస్పిటల్ వారిని సంప్రదించి అడ్మిట్ అయ్యారు.అయితే తల్లి బిడ్డలను పరీక్షించి ఆపరేషన్ చెయ్యడం ద్వారా బిడ్డను తల్లిని కూడా కాపాడొచ్చని గైనికాలజిస్ట్ చరిష్మా తెలపడంతో అత్యంత అరుదైన ప్రిమెచూర్ బేబీకి జన్మనివ్వడం జరిగింది. పిడియాట్రిక్ డాక్టర్ సంపత్ కుమార్ ఆధ్వర్యంలో పుట్టిన బిడ్డకు ఎటువంటి హానీ జరగకుండా జాగ్రత్తగా కాపాడి మంగళవారం డిశ్చార్జ్ చేసినట్టు హాస్పిటల్ యాజమాన్యం తెలిపారు. సాధారణ ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో విజయ ఆసుపత్రి నెలకొల్పామని అందులో భాగంగా ఖర్చుతో కూడుకున్న వైద్యసేవలకు నోచుకొని ఎంతోమందికి ఆరోగ్యశ్రీద్వారా ఉచిత వైద్యం అందిస్తున్నామని హాస్పిటల్ ఎండి దూబ పద్మావతి తెలిపారు. ఆమెతో పాటు వైద్యులు పాల్గొన్నారు.

ఘనంగా జరిగిన శ్రీశ్రీశ్రీ పెద్దపోలమ్మతల్లి పండగ సంబరాలు

విశాలాంధ్ర - సీతానగరం : మండలంలోని గుచ్చిమిగ్రామంలో మంగళవారంనాడు బూరాడ, మరిపి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ పెద్దపోలమ్మతల్లి పండగ సంబరాలు మంగళ వారం నాడు ఘనముగా చేశారు. గ్రామంలోని మరిపి సింహాచలం ఇంట్లో అమ్మవారికి, అమ్మవారి ఘట్టాలకు, అమ్మవారి ప్రతిమలకు పూజలనుచేసి అక్కడ నుండి మూడుఘటాలను, అమ్మవారిని మేళతాళాలతో, డీజేతో గ్రామస్తులంతా కలిసికట్టుగా గుడికివెళ్ళారు. బూరాడ, మరిపి కుటుంబాలతోపాటు శ్రీశ్రీశ్రీ పెద్దపోలమ్మతల్లి గుడికి చేరుకుని అక్కడ పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో బూరాడ పాపినాయుడు, బూరాడ చిరంజీవి, బూరాడ ఆదినారాయణ, శంకరరావు, శివున్నాయుడు, సూర్యనారాయణ, తిరుపతిరావు లక్షున్నాయుడు, ఉపేంద్ర మరిపి కుటుంబాలకు చెందిన గణపతిరావు, ఈశ్వరరావు, సింహాచలం, వెంకటేష్, సురేష్, శివున్నాయుడు, సూర్యనారాయణ, కుమారనాయుడు ఫకీరునాయుడులు, మర్రాపు సత్యనారాయణ, మరిశర్ల సంజీవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రక్త నిల్వలు పెంచాల్సిన అవశ్యకత ఉంది

విశాలాంధ్ర - బెలగాం : రక్తహీనత నివారణకు, ప్రాణాపాయ సమయాల్లో రక్తాన్ని అందించేందుకు రక్త నిల్వలు పెంచాల్సిన ఆవశ్యకత ఉందని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ అన్నారు. జిల్లా ఆసుపత్రిని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సేవలకు ఇబ్బంది కలగకుండా సాధారణ పౌరునిగా వెళ్లి ఆసుపత్రిలో అందుతున్న సేవలను నిశితంగా పరిశీలించారు. ఆసుపత్రికి జిల్లా కలెక్టర్ వచ్చారని తెలియడంతో వైద్య సిబ్బంది, రోగులు అవాక్కయ్యారు. ఆసుపత్రిలోని జనరల్ వార్డ్, బ్లడ్ బ్యాంక్ (రక్తనిధి), సదరం, కంటి తనిఖీ కేంద్రం, స్త్రీ ప్రసూతి విభాగం, దంత వైద్య విభాగం, ఓపి తో పాటు ప్రతీ విభాగాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అత్యవసర కేసుల వివరాలు, ఎక్కవగా ఏ కేసులు వస్తున్నాయి అనే వివరాలను వైద్యులను ప్రశ్నించారు. అనీమియా కేసులు, అత్యవసర కేసులు వస్తున్నట్లు వైద్యులు తెలపగా రక్త దాన శిబిరాలు నిర్వహించి రక్త నిల్వలు పెంచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రక్త నిల్వల (రక్త నిధి) పరికరాలను పరిశీలించి నిత్యం పరిశుభ్రంగా ఉండేలా నిర్వహణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఆసుపత్రిలో కల్పించిన వసతులు వినియోగంలో ఉండాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. రోగులకు అందిస్తున్న భోజన వంటకాలను పరిశీలించారు. రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆసుపత్రి వాతావరణం ఉండాలని లేనిపక్షంలో సహించేది లేదని హెచ్చరించారు. ఆసుపత్రి సందర్శన అనంతరం అందుతున్న వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ నాగ శివజ్యోతి, ఆసుపత్రి వైద్యులు బి.వాగ్దేవి, ఎపిఎంఐడిసి ఇంజనీరింగ్ అధికారి బి.ప్రసన్న కుమార్, వివిధ విభాగాల వైద్యులు డా.సీతారామరాజు, డా.డి. వెంకటరావు, డా.వి.శ్రీధర్, డా.దినేష్ కుమార్, డా.కమల కుమారి, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మహిళా హక్కుల కోసం, భవిష్యత్ పోరాటాలకు సిద్ధం అవుదాం

ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సిహెచ్. రమణి

విశాలాంధ్ర - విఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని సున్నంవారి గూడెం గ్రామం లో రెండవరోజు ఐద్వా రాజకీయ శిక్షణా తరగతులలో ముఖ్య అతిథిగా రాష్ట్ర ఐద్వా ఉపాధ్యక్షురాలు సీహెచ్ రమణి పాల్గొని మాట్లాడుతూ మహిళా హక్కుల కోసం పోరాటాలే మార్గమని, ఎన్నికల సందర్భంగా ప్రభుత్వాలు ఉచిత హామీల మీద హామీలు ఇస్తూ ప్రజలను మభ్యపెట్టి అధికారం అనే అందలం ఎక్కగానే ఆ హామీలను గాలికి వదిలేసి నిధులు లేవని పేరుతో కాలయాపన చేస్తూ పబ్బంగడుపు కుంటున్నారని, తల్లికి వందనం, ఫ్రీ గ్యాస్, ఉచిత బస్సు సౌకర్యం కల్పించ కుండా, నిరుద్యోగ భృతి 3000 ఇంట్లో ఉండి పనిచేసే మహిళలకు నెలకు 1500 ఇస్తామని చెప్పి మభ్యపెట్టి నేడు ఓ సామెతలా వ్యవహా రిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా మహిళలందరూ మనకు జరిగే అన్యాయంపై కలిసికట్టుగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో ఐక్య ఉద్యమాలకు సిద్ధం అవ్వాలని కోరారు. యుటిఎఫ్ సీనియర్ నాయకులు సున్నం రాజులు మాట్లాడుతూ గ్రామాల్లో మహిళా చైతన్యం పెరగాలని విద్యార్థులు యువతీ యువకులు స్వాతంత్ర పోరాట స్ఫూర్తితో మనకు జరిగే అన్యాయాలపై పోరాటం నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్ కుమార్ మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించడంలో ఆదివాసి హక్కులు చట్టాలు అమలు చేయడంలో పాలక ప్రభుత్వాలు నిమ్మకు నీరు ఎత్తి నట్లుగా వ్యవహరిస్తూ నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నాయని ప్రజాసంఘాల ఐక్య ఉద్యమాలు భవిష్యత్తులో తీవ్రతరం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాలు ఐ.పద్మ, సున్నం పార్వతి, ముర్రం రంగమ్మ, వీరమ్మ, సుబ్బమ్మ, రాములమ్మ, తోడం చిన్న బూబమ్మ, సర్పంచులు, ఎంపీటీసీలు, మరియు చింతూరు, ఎటపాక, కూనవరం, విఆర్.పురం, మండలాల నుంచి మహిళలు, విద్యార్థినిలు, యువతులు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లింపులో సిబ్బంది నిర్లక్ష్యం వహించొద్దు

విశాలాంధ్ర - అనంతగిరి : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి కూలీల లబ్దిదారుల వేతనాలు చెల్లింపులో సిబ్బంది నిర్లక్ష్యం వహించవద్దని ఎంపీడీవో ఎవివి. కుమార్ అన్నారు సోమవారం మండలంలోని చిలకలగెడ్డ పంచాయతీ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ భూ సదును పనులను సందర్శించి పరిశీలించా మన్నారు పనుల సమయంలో కూలీలు ఎదురవుతున్న వలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం ప్రకారం పనులు జరిగిన వారం రోజులకే రోజువారి రూ 307 ప్రేమట్లు చెల్లించాలని అలాగే ఉదయం 6 గంటల నుండి 11 గంటల వరకు పనులు చేపట్టాలని ప్రతి ఒక్క లబ్ధిదారుడు ఈశ్రమ్ ఇన్సూరెన్స్ పథకాన్ని సద్వినియోగం పరుచుకోవాలని సూచించారు. అలాగే మండలంలోని ఉన్న 24 పంచాయతీ పరిధి గ్రామంలో పశువులకు వేసవిదృష్ట తాగునీటి కల్పించేందుకు 60 తొట్టెలు నిర్మించవలసి ఉనప్పటికీ ప్రస్తుతం 34 తొట్టెలు మాత్రమే పూర్తిజమని కొత్త పనులు కూడా పూర్తి చేసేందుకు సిబ్బంది కృషి చేరని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఏజెన్సీ ఉద్యోగాలన్నీ గిరిజనులకే సీఎం చంద్రబాబు

చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన బాకూరు పాండురాజు

విశాలాంధ్ర - కొయ్యూరు అల్లూరి జిల్లా : ఏజెన్సీ ప్రాంతంలో ఉద్యోగాలన్నీ గిరిజనులకే వంద శాతం రిజర్వేషన్ కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని, జీవో నెంబర్ 3 పునరుద్ధరణ కోసం పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించడం హర్షణీయమని కరాటే అసోసియేషన్ ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ కోఫూకాన్ కరాటే చీఫ్ ఇన్ స్ట్రక్టర్ ఎగ్జామినర్ బాకూరు పాండురాజు అన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించిన ప్రకటనతో గిరిజన ప్రాంతంలో ఉన్న నిరుద్యోగ యువత చాలా సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఆయన అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించడం పట్ల మన్య ప్రాంతంలో ప్రతి ఒక్క నిరుద్యోగ గిరిజనులు ఆనందోత్సవాల్లో మునిగితేలుతున్నారని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ప్రకటనతో ఏజెన్సీ వ్యాప్తంగా ఉన్న అన్ని శాఖల్లో ఉద్యోగాలన్నీ గిరిజనులకే చెందుతాయి అని అన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

వాసవ్య మహిళా మండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయ్‌కుమార్

విశాలాంధ్ర - చింతపల్లి : మహిళలు అన్ని రంగాలలో రాణించి, అభివృద్ధి చెందాలని వాసవ్య మహిళా మండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయ్ కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం వాసవ్య మహిళా మండలి ఆధ్వ ర్యంలో నిర్వహించిన ఒక్కరోజు శిక్షణా కార్య క్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలు డిజిటల్ నైపుణ్యం, సురక్షిత ఆరోగ్యం, ఆర్థిక అభివృద్ధి పై ఇచ్చిన శిక్షణ తరగతులపై మహిళలు అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుండి అభివృద్ధి చెందేలా కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ శిక్షణలో డిజిటల్ నెపుణ్యత, సురక్షిత ఆరోగ్యం, వ్యవస్థాపకత" వంటి అంశా లపై మహిళలకు, వాసవ్య మహిళా మండలి సభ్యులు అవగాహన కల్పించారు.. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎన్ఐటి ప్రొఫెసర్ డా. బి. స్ఫూర్తి, ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీమతి సునీత, ప్రోగ్రాం కోఆర్డినేటర్, కౌన్సిలర్లు, కమ్యూనిటీ కో-ఆర్డి నేటర్లు తో పాటు చింతపల్లి మండలంలోని 20 స్వయం సహాయ సంఘాల సభ్యులు హాజరయ్యారు.

ముగిసిన మోదమ్మ గిరిజన జాతర

తవిశాలాంధ్ర - పాడే న్యూస్ : అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరులో మూడు రోజులుగా జరుగుతున్న గిరిజన ప్రజల ఆయుర్వేద దేవం మోదకొండమ్మ తల్లి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ముడిశాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ఉత్సవాలకు కోటి రూపాయలు కేటాయించారు. పాడేరు శాసనసభ్యులు విశ్వేశ్వర రాజు కూటమి పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో ఈనెల 11న ఉత్సవాలు ప్రారంభ మయ్యాయి. ఈ ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా, ఛత్తీస్ ఘడ్ రాష్ట్రాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. గిరిజన మంత్రి గుమ్మడి సంధ్యారాణి మంగళవారం అమ్మవారిని దర్శించుకుని సాయంత్రం అనుపోత్సవన్ని నిర్వహించారు. తొలి రోజు శతకం పట్టులో కొలువుదీరిన మోదకొండమ్మ భక్తుల పూజలు అందుకుంది. ఉదయం సాయంత్రం వేళల్లో అక్కడ దప్పుల మోతలతో అమ్మవారికి సేవలు అందించారు. తొలి రోజు ఆలయం నుంచి ఊరేగింపుగా శతకం పట్టులో కొలువు దీరిన అమ్మవారి ఉత్సవ విగ్రహం పాదాలను అనుపోత్సవంతో తిరిగి ఆలయంలో చేర్చారు. పాడేరు పట్టణ పురవీధుల్లో భారీ యూరోగింపుతో రకరకాల నృత్యాలు, వేషాలు, దప్పుల వాయిద్యాల సందడి వాతావరణంలో ఉత్సవ మూతిని పాదాలను ఊరేగించారు.

డుంబ్రిగుడ గ్రంథాలయంలో కబడ్డీ పోటీలు

విశాలాంధ్ర - డుంబ్రిగుడ : డుంబ్రిగుడ శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం ఇక్కడి గ్రంథాల యంలో గ్రంథాలయ అధికారిణి శెట్టి సునీత చిన్నా రులకు కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 18 మంది చిన్నారులు పాల్గొన్నారు. విద్యా ర్థులు చదువుతో పాటు ఆటపాటల్లో కూడా ముంద ంజలో ఉండాలని ఆమె చెప్పారు. పోటీల్లో గెలు పొందిన విద్యార్థులకు ముగింపు రోజున బహుమతులు ప్రధానం చేస్తామని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కమ్మిడి సుబ్బారావు పాల్గొన్నారు.

రాకాశమ్మ దేవి జాతరలో తాగునీటి సమస్య రానివ్వం

విశాలాంధ్ర - చింతపల్లి : మండలంలోని లంబసింగి పంచాయతీ బురదవీధి గ్రామంలో జరుగు తున్న రాకాశమ్మ దేవి జాతరలో త్రాగునీటి సమస్య రానివ్వమని ఆ పంచాయతీ సర్పంచ్ కొర్ర శాంతి కుమారి, మాజీ సర్పంచ్ రఘునాథ్‌లు అన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా మన్యంలో త్రాగునీటి సమస్య ఉన్నప్పటికీ, మన్య ప్రాంతంలో జాతర లు జరుగుతున్న ప్రతి చట ఆయా పంచాయతీల సర్పంచులు త్రాగునీటి సమస్య తాత్కా లిక పరిష్కారానికి ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తున్న విషయం పాతకులకు తెలిసిందే. ఈ క్రమంలోనే ఆంధ్ర కశ్మీర్ గా పేరుందిన లంబసింగి పంచా యతీ గరుడవేది గ్రామంలో రాకాశమ్మ దేవి జాతరను పురస్కరించుకొని గ్రామస్తులతో పాటు, జాత రకు వస్తున్న భక్తులకు త్రాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా ట్యాంక్‌ల ద్వారా త్రాగు నీటిని సరఫరా చేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డ్ సభ్యుడు రాజుబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో భారీ వర్షం

విశాలాంధ్ర - డుంబ్రిగుడ : డుంబ్రిగుడ మండల కేంద్రంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా భారీ వర్షం కురవడంతో కొండపై నుంచి వరద నీరు గ్రామంలో పలు నివాస గృహాల్లో చేరడంతో గ్రామస్తులు ఇబ్బం దులు పడ్డారు. భారీ వర్షం కురవడంతో సరైన డ్రైనేజీలు లేకపోవడం వల్ల కొండ కోనలపై నుంచి వరద నీరంతా గ్రామంలో ఉప్పొంగి ప్రవహిస్తూ వీధులంతా జలామయం అవడంతో గ్రామస్తులు భయ భ్రాంతులకు గురయ్యారు. కొందరి నివాసగృహాల్లో వరద నీరు పూర్తిగా ప్రవాహంలో రావడం వల్ల వరద నీరును వేరే మార్గంకు చూపించేందుకు పలు ఇబ్బందులు పడ్డారు.

గిరిజన ప్రజలు సుభిక్షంగా ఉండాలి : గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి

రాష్ట్ర ప్రభుత్వ తరుపున పట్టువస్త్రాలు సమర్పణ

విశాలాంధ్ర - పాడేరు న్యూస్ : గిరిజన ప్రజలు సుభిక్షంగా ఉండాలని శ్రీ శ్రీ శ్రీ మోద కొండమ్మ అమ్మవారిని మొక్కు కున్నా నని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి గుమ్మడి సంధ్య రాణి పేర్కొన్నారు. గిరిజన ఆరాధ్యదైవం మోద కొండమ్మ అమ్మవారి జాతర మూడవ రోజు మంగళవారం మోదకొండమ్మ అమ్మవారిని మంత్రి దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ లాంఛనాలతో మంత్రికి ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. మంత్రి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్థానిక పి.యంఆర్‌సీకి చేరుకున్నారు. అనంతరం శతకం పట్టు వద్దకు వెళ్లి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె విలేఖరులతో మాట్లాడుతూ ప్రజల కోర్కెలు తీర్చే కల్పవల్లి ప్రజల కోర్కెలు తీర్చాలని కోరుకున్నానన్నారు. అర్హులందరికి ప్రభుత్వ పథకాలు అందించడానికి రాష్ట్ర ముఖ్య మంత్రి కృషి చేస్తున్నారన్నారు. జి. ఓ ఎం ఎస్ నెం. 3 కు ప్రత్యామ్నాయంగా వేరొక జి ఓ జారీ చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి త్వరలోనే అల్లూరి సీతారామ రాజు జిల్లా ను సందర్శిస్తారని పేర్కొన్నారు. అధికారులు ఉత్సవ కమిటీ సమన్వయంతో మోదకొండమ్మ జాతరను విజయ వంతం చేసారని అభినందించారు. అనంతరం వివిద ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి జిల్లా కలెక్టర్ డా.ఎం.జె. అభిషేక్ గౌడ, ఎస్పీ అమిత్ బర్దార్, పోలవరం ప్రాజెక్టు పరిపాలనాధికారి వి. అభిషేక్, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి, మాజీ శాసన సభ్యురాలు గిడ్డి ఈశ్వరి, ఐటిడి ఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం. వేంకటేశ్వరరావు, పరిపాలనాధికారి ఎం. హేమలత, ఐసిడి ఎస్ పిడి ఎన్. సూర్య లక్ష్మి, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఝాన్సీరాణి, ఎల్.రజిని, సిడిపిఓ తదతరులు పాల్గొన్నారు.

శిథిలమైన మండల ప్రజా పరిషత్ కార్యాలయం

విశాలాంధ్ర - బలిజిపేట : బలిజిపేట మండలం ప్రధాన కేంద్రము గల మండల ప్రజా పరిషత్ కార్యాలయము అంతా శిథిలమై పెచ్చులు ఊడుతున్నాయి. శుక్రవారం ఉదయము కార్యాలయములో సిబ్బంది ఎవరి పనులు వారు చేస్తుండగా కార్యాలయము పై భాగము నుండి పెచ్చులు ఊడడము గమనించి ఆఫీసు సిబ్బంది భయాందోళనకు గురయ్యారు ఈ భవనము నిర్మాణము జరిగి సుమారుగా 36 సంవత్సరములు జరిగిందని ఈ కార్యాలయమును మరల పునర్ నిర్మాణం చేయాలని ఆఫీసు సిబ్బంది తెలియ జేశారు అందుకు సంబం ధించిన అధి కారులు స్పందించి కొత్త భవనము నిర్మాణం చేయగలరని సిబ్బంది కోరుతున్నా రు.

సాగునీటి సమస్య పరిష్కారానికి జలవనరుల శాఖ సమావేశం ఏర్పాటు చేయండి

విశాలాంధ్ర - పాలకొండ : తోటపల్లి బ్యారేజి మరియు పాత కాలువాల జల వనరుల శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి ఆయుకట్టు రైతుల సాగు నీటి సమస్యల పరిష్కారం చేయవలసినదిగా విజ్ఞప్తి చేస్తున్నాం. 1907-8 సంవత్సరంలో అప్పటి బ్రిటీష్ వారు ప్రస్తుత బ్యారేజ్ కు దిగువన 500 మీటర్ల దూరంలో ఆనకట్ట వద్ద 414 క్యూసెక్కులతో కూడిన తూము ద్వారాఎడమ ప్రధాన కాలువ పరిధిలో 32000 ఎకరాలకు,కుడి ప్రధాన కాలువ పరిధిలో 8000 ఎకరాలకు సాగునీ రిచ్చుట నాగావళి నదిపై రెగ్యులేటర్ ఏర్పాటు చేసి ఉన్నారు.అదే సమయంలో నాగావళి నదిపై శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలం నారాయణపురం వద్ద మరో ఆనకట్ట ఏర్పాటు చేసి ఉన్నారు.రెండు ఆనకట్ల మధ్య నాగావళి నదిపై వీరఘట్ట,పాలకొండలం,భూర్జ మండలాలలో 9 ఓపెన్ హెడ్ చానల్స్ ద్వారా సుమారు 20,000 ఎకరాలకు సాగునీరు ఇస్తున్నారు.పాలకొండ మండలం ఓనె గెడ్డ నుండి బూర్జ మండలానికి చెందిన 8000 ఎకరాలు సాగు నీరు అందుతుంది.బ్యారేజీ నిర్మాణం చేయు సమయంలో 64 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించుట గాను 700 క్యూసెక్కులతో తూం ఏర్పాటు చేయవలసి ఉన్నప్పటికీ అధికారులు చేసిన తప్పిదం వల్ల బ్రిటీష్ ఏర్పాటుచేసిన 414 క్యూసెక్కులతో మాత్రమే తూము ఏర్పాటు చేశారు.నాగావళి నదిపై ఉన్న ఓపెన్ చానల్స్ అన్నింటికీ ఎడమ ప్రధాన కాలువ ద్వారా అనుసంధానం చేస్తూ సాగునీరు ఇచ్చుటకు బ్యారేజి కట్టే సమయంలో డిజైన్ చేసి ఉన్నారు. నేడు జల వనరుల శాఖ అధికారులు మాట్లాడుతున్న ప్రతి సందర్భంలోనే అధికార మీటింగ్‌లోనా పాత ఆయకట్టు 64000 ఎకరాలు మరియు కొత్త ఆయకట్టు(కుడి ప్రధాన కాలువ) లక్ష 20000 ఎకరాలు కలిపి 1,84,000 ఎకరాలకు గాను బ్యారేజ్ నుండి నీరు ఇస్తున్నట్టుగా స్పష్టంగా తెలుపుతున్నారు. వాస్తవానికి అధికారులు తెలిపిన విధంగా సాగునీరు ఎడమ ప్రధాన కాలువ ద్వారా అనుసంధానం చేసే పరిస్థితి ప్రస్తుతానికి లేదు.ఆయకట్టు రైతుల భవిష్యత్తు ప్రశ్నార్థకమే. ప్రత్యామ్నయంబ్యారేజీ వద్ద ఏర్పాటు ఎడమ తూము కు మరో 500 మీటర్ల దూరంలో 350 క్యూసెక్కులతో మరో స్లూయిస్ ఏర్పాటు చేసి తోటపల్లి,సుంకి,నాగూరు తదితర గ్రామాలు మరియు రావాడ రిజర్వాయర్ నీరందని చివర ఆయకట్టుకు చెందిన 8000 ఎకరాలకు సాగునీరు ఇస్తూ డిజైన్ లో పొందుపరిచిన విధంగా 64,000 ఎకరాలకు సాగు నీరు ఇవ్వవచ్చు. ప్రస్తుతం తూము వద్ద షట్టర్స్ ఫంక్షనింగ్ సరిగా జరగడం లేదు.దీనివల్ల కాలువలో నీటి ప్రవాహాన్ని నియంత్రించడానికి అవకాశం లేకుండా పోతుంది కనుక ఈ ఖరీఫ్ తసీజన్లో తక్షణమే వీటిని బాగు చేయాలి. ఆధునీకరణ పనులు ప్రభుత్వ వచ్చే సంవత్సరానికి కావలసిన నిధులను తాజా వ్యయాన్ని పరిగణలోకి తీసుకొని నిధులు ఇవ్వాలి.ఆ సమయంలో కాలవాలు లైనింగ్ చేస్తూ మరో ప్రక్క ప్రధాన కట్టడాలు పెదబుడ్డిడి వద్ద ఆక్వడక్ట్,జంపర్ కోట గెడ్డ పైన, ఓని గెడ్డ పైన ఆక్వడక్టు పనులు ఏక కాలంలో జరపాలి. తోటపల్లి బ్యారేజీ వద్ద కాలువ ఏర్పాటుచేసిన సుయిస్ షట్టర్ ట్రక్ అయిపోయిన గేటు మరమ్మతులు తక్షణమే చేపట్టాలి. పైఅంశాలను చర్చించుడకు గాను జల వనరుల శాఖ అధికారులతో ఖరీఫ్ సన్నాహక సమావేశం ఏర్పాటు చేయవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము. అని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పల నాయుడుతో కూడిన రైతు నాయకులు గురుబిల్లి అప్పలనాయుడు జిల్లా అధ్యక్షులు రౌతు సోంబాబు (గుడివాడ నీటి సంఘం అధ్యక్షులు) పామోటు వైకుంఠ రావు (నీటి సంఘం డైరెక్టర్) కిమిడి రామ్మూర్తి నాయుడు కౌలు రైతుల సంఘంజిల్లా అధ్యక్షులు వావిలిపల్లి రమణమూర్తి (జిల్లా ఉపాధ్యక్షులు)లోలుగు సంఘం నాయుడు లుంబురుసంఘం గ్రామ అధ్యక్షులు కోట విశ్వేశ్వరరావు గుడివాడ స్థానిక సబ్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డికి మంగళవారం విజ్ఞాపన పత్రం ఇవ్వగా వారు స్పందిస్తూ సంబంధిత అధికారులతో త్వరలోనే సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

కోడి పిల్లల పెంపకంతో ఆర్థిక అభివృద్ధి : పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ నరసింహులు

విశాలాంధ్ర - రంపచోడవరం : రంపచోడవరం మండలం తాళ్లపాలెం గ్రామంలో హిఫర్ ఇంటర్నేషనల్ మరియు నవ జీవన్ ఆర్గనైజేషన్ వారి హ్యాచ్చింగ్ హెవ్ యాక్సిలేటర్ ఇన్ కామ్ - బ్రిడ్జ్ టు సస్టెన్ బిలిటి ప్రోగ్రాం ఆధ్వర్యంలో కోడి పిల్లల పంపిణీ మరియు ప్రోగ్రాం యొక్క మూలా స్థంబాలలో భాగంగా పాసింగ్ గిఫ్ట్ కార్యక్రమం లో రైతులు పెంచుకొన్న నాటు కోళ్ళను ఒక రైతు నుండి వేరొక రైతుకీ ఇప్పించటం జరిగింది. ఈ కార్యక్రమం ముఖ్య అతిదులుగా అల్లూరి జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ నరసింహులు, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ షరీఫ్, హిఫర్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ శ్యామ్ కట్టా (బెన్నీ) పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అల్లూరి జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ నరసింహులు మాట్లాడుతూ కోడి పిల్లల పెంపకంతో ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చు అని వాటి గుడ్లు, మాంసం వినియోగించడం ద్వారా మన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. గిరిజన ప్రాంతంలో మారుమూల గ్రామాలలో ఈ సమస్దలు కోళ్ళ పెంపకం పై శిక్షణాలు ఇస్తూ ,కోడిపిల్లలను మెతను ఇవ్వటం ఆనందదాయకంగా వుందని అన్నారు. ప్రతీ ఒక్కరూ కోళ్ళను పెంచాలని తెలిపారు. అనంతరం రంపచోడవరం పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ షరీఫ్ మాట్లాడుతూ రంపచోడవరం డివిజన్‌లో ఈ నాటు కోళ్ళ పెంపకంపై ఇప్పటికే ప్రభుత్వానికి నివేదికలు పంపామని అన్నారు. హిఫర్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ శ్యామ్ కట్టా (బెన్నీ) మాట్లాడుతూ మా సంస్ద ద్వారా 2020 నుండి రంపచోడవరం డివిజన్లో కోళ్ళ పెంపకం పై అవగాహన సదస్సులు పెడుతూ, శిక్షణాలు ఇవ్వటం జరిగిందని అన్నారు. గ్రామాలలో కోళ్ళకు వేక్షిన్‌లు వెయ్యటానికి అదే గ్రామంలో యువతకు ట్రైనిగ్ ఇచ్చి కేవ్ లుగా నియమించి వారికి ఉపాధి కల్పించామని తెలిపారు. డివిజన్‌లో అడ్డతీగల, గంగవరం, రంప చోడవరం మండలాలో గిరిజన రైతులు, రైతులకు కోళ్ళ షెడ్‌లు నిర్మించి కోడిపిల్లలు, మెతను ఇవ్వటం జరిగిందని అన్నారు. అలాగే మారేడుమిల్లి, వై.రామవరం మండలాలో కూడా ఈ కోళ్ళ పెంపకంపై అవగాహన చేపడ తామని అన్నారు. ఈ కార్య క్రమంలో పశు సంవర్ధక శాఖ ఏ.డి. డాక్టర్ సూర్య నారాయణ, కృషి విజ్ఞాన్ కేంద్రం పందిరిమామిడి సైంటిస్ట్ వీరాంజనేయులు, హిఫర్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ గణేశ్, అజయ్, నజీవన్ సిబ్బంది. శ్రీనివాస్, నాగేశ్వర రావు, శ్యామల, సాయి వెంకట్, చిన్నలు దొర, బాబూరావు, సత్తిబాబు, వృద్యి, ప్రశాంత్, రైతులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

జీడి ప్రాసెసింగ్ యూనిట్ పనులను పర్యవేక్షించిన పీఓ

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : పట్టణ పరిధిలోని మార్కెట్ యార్డ్ యందు నిర్మించబోతున్న జీడి ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణ పనులను ఐటీడిఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు, సిబ్బందికి ఆయన పలు సూచనలు, మార్గదర్శకాలతో దిశా నిర్దేశం చేశారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్శనలో గిరిజన సంక్షేమ శాఖ కార్య నిర్వాహక ఇంజినీర్ మణిరాజ్, ఏపీఓ మురళీధర్, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పన్నెండు, పదవ తరగతిలో నూరుశాతం సాధించిన జీ.కే వీధి ఏకలవ్య పాఠశాల

విశాలాంధ్ర - జికె వీధి : మండలంలోని ఏకలవ్యలో పన్నెండు పదవ తరగతి విద్యార్థులు సత శాతం ఉత్తీర్ణత సాధించారని ఏకలవ్య పాతశాల ప్రిన్సిపాల్ ఎం వి రమణ రావు తెలిపారు. పదవ తరగతి పరీక్షల్లో 60 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 60 మంది విద్యార్థులు మరియు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవ త్సరం 74 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 74 మంది కూడాను ఉత్తీర్ణత సాధించా రన్నారు. మా ఏకలవ్య పాతశాల విద్యార్థులందరూ 100% ఉత్తీర్ణత సాధించినందుకు ఏకలవ్య పాతశాల ప్రిన్సిపాల్ ఎంవి రమణారావు విద్యార్థు లందరికీ అభినందనలు తెలియజేశారు. ఏకలవ్య పాతశాలలో ఇంటర్మీడియట్ పదవ తరగతి విద్యార్థులు సతశాతం పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి నందుకు ఏకలవ్య ప్రిన్సిపాల్ ఎంవి రమణా రావుకు, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు జీకే వీధి తహసిల్దార్ టి రామకృష్ణ, జీకే వీధి సర్కిల్ ఇన్స్పెక్టర్ వరప్రసాద్ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

నేడు పనుకువలస ఎంఎస్ఎంఇ పార్కుకు శంకుస్థాపన

విశాలాంధ్ర - సీతంపేట : పాలకొండ నియోజక వర్గంలో పనుకువలస వద్ద ఎంఎస్ ఎంఇ పార్కుకు శంకుస్థాపన చేయడం జరుగుతుందని ఏపీఐఐసి జోనల్ మేనేజర్ ఎం మురళి మోహన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 14వ తేదీ ఉదయం 10 గంటలకు శంకుస్థాపన జరుగుతుందని ఆయన తెలిపారు. మొదటి దశలో 27.26 ఎకరాలను అభివృద్ధి చేయడం జరుగుతుందని అన్నారు. ఈ ప్రాజెక్టుకు రూ.11.39 కోట్లు ఖర్చు జరుగుతుందని ఆయన వివరించారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ధన్యవాదాలు : ఆదివాసి జేఏసీ

విశాలాంధ్ర - జీకే వీధి : జిఓ 3ని పునరుద్ధరి స్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జెఎసి రాష్ట్ర వైస్ చైర్మన్ మొట్టడం రాజబాబు, మండల కన్వీనర్ కొర్ర బలరాం,ప్రధాన కార్యదర్శి సిద్ధార్థ మార్క్, జెఎసి సోషల్ మీడియా రాష్ట్ర సభ్యుడు రీమెల పాలు, జెఏసి మండల సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు లకే రామచంద్రుడు,జెఏసి మండల కార్యవర్గ సభ్యుడు కొర్ర నారాయణ ధన్యవాదాలు తెలియజేశారు. సోమవారం అమరావతిలో జరిగిన రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏజెన్సీ ప్రాంతంలో ఉద్యోగ అవకాశాలను స్థానిక గిరిజనులకే కేటాయించడానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేస్తూ, 2000ల సంవత్సరంలో అధికారంలో ఉన్న తెదేపా ప్రభుత్వం గిరిజనల ప్రయోజనాల కోసం జిఓ3 ని రూపొందించి, ఏజెన్సీ ఉద్యోగాలు స్థానిక ఆదివాసీలకు కేటాయించామని, న్యాయ సమీక్షలు వల్ల జిఓ 3 రద్దయిందని, గిరిజనుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని, జిఓ3 పునరుద్ధరణకు చర్యలు చేపడుతున్నామని ప్రకటించడాన్ని ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జెఎసి నాయకులు స్వాగతిస్తూ, ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వం వెంటనే గిరిజన సలహా మండలి (టిఎసి)ని ఏర్పాటు చేయాలని, అనంతరం జిఓ3 పునరుద్ధరణలో భాగంగా వెంటనే షెడ్యూల్డ్ ప్రాంత నియామకాల చట్టాన్ని రూపొందించాలని, ప్రస్తుత మెగా డిఎస్సి నుండి ఏజెన్సీ ఉద్యోగాలను మినహాయించి, షెడ్యూల్డ్ ప్రాంత నియామకాల చట్టం రూపొందించిన అనంతరం, ప్రత్యేక ఏజెన్సీ డీఎస్సీని చేపట్టాలని డిమాండ్ చేశారు. గిరిజన సలహా మండలి (టిఎసి)ఏర్పాటు చేసి, ఏజెన్సీ ఉద్యోగ నియామకాల చట్టాన్ని రూపొందించి ప్రత్యేక ఏజెన్సీ డీఎస్సీ ని చేపట్టేంతవరకు ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జెఎసి ఉద్యమ కార్యాచరణని కొనసాగిస్తుందని తెలియజేశారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఐటిడిఏ కేంద్రాలలో రిలే నిరాహార దీక్షలు, స్థానిక ప్రజాప్రతినిధులకు విన్నపాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

ఇదేం పని! పోలీస్ స్టేషన్‌కి దారి లేకుండా చేశారు

విశాలాంధ్ర - పాలకొండ : పాలకొండ ప్రజలకే కాదు పోలీసులకు సైతం చుక్కలు చూపిస్తున్నారు నగర పంచాయతీ అధికారులు కారణం ఏమిటని అంటారా.. పాలకొండ ప్రధాన రహదారిలో వీధి కాలువలు పూడికలతో నిండిపోయాయి దీంతో పోలీస్ స్టేషన్ నుంచి ఆంజనేయ సెంటర్ వరకు రహదారిపై మురుగునీరు ప్రవహించేది ఇలా రోజుల తరబడి ప్రవహిస్తుండడంతో స్థానికులు పోలీసులు రాకపోకలకు తీవ్రమైన ఇబ్బందులు పడేవారు ఈ సమస్యను పలుమార్లు నగర పంచాయతీ సిబ్బందికి,అధికారుల దృష్టికి పాత్రికేయులు తీసుకెళ్లడంతో నగర పంచాయతీ అధికారులు ఆలస్యంగా మేల్కొన్నారు దీంతో అధికారులు గత నెల 25వ తేదీన రాత్రి జెసిబితో పనులు ప్రారంభించారు సమస్య పరిష్కారం చూపారు అనుకున్న ప్రజలకు పోలీసులకునగర పంచాయతీ అధికారులు కొత్త సమస్యను తెచ్చిపెట్టారు పోలీస్ స్టేషన్ ఎదురుగా నూతన కల్వర్టు నిర్మాణానికి వీలుగా జెసిబి తో త్రవ్వకాలు చేపట్టారు అక్కడతో తమ పని అయినట్లు అసంపూర్తిగా విడిచిపెట్టారు దీంతో అప్పటినుంచి పోలీస్ స్టేషన్కు వెళ్లేందుకు దారిలేని పరిస్థితి నెలకొంది ప్రధానమైన పోలీస్ స్టేషన్ కే ఈ పరిస్థితి వచ్చిందంటే సామాన్య ప్రజల సమస్యలు ఎలా పరిష్కరిస్తారని ప్రజలు గుసగుస లాడుకుంటున్నారు నగర పంచాయతీలో కాసులు మిగులుతాయి అనుకున్న పనులకే వేగంగా చేపడుతున్నారు తప్ప మిగిలిన పనులు ఆలస్యంగా చేస్తున్నారని మొదట్నుంచి విమర్శలు వినబడు తున్నాయి. ఇందులో భాగంగానే పోలీస్ స్టేషన్కు దారి లేకపోయినా పనులు చేపట్టడం లేదన్న విమర్శలు ఉన్నాయి ఇప్పటికైనా నగర పంచాయతీ అధికారులు మేల్కొంటే పోలీసులకు దారి సమస్య తీరుతుంది లేనిపక్షంలో పోలీస్ స్టేషన్కు ఉన్నత స్థాయి అధికారులు సందర్శనకు వచ్చే సమయంలో రాకపోకలకు దారి లేని సమస్య ఏర్పడుతుంది కల్వర్టు నిర్మించకపోవడంతో పోలీసు వాహనాలు స్టేషన్ లోపలికి వెళ్లలేని పరిస్థితి నెలకొని ఉంది పోలీసులు అత్యవసర సమయాలలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు దీంతో రోడ్డు పక్కన వాహనాలు ఉంచుకోవలసిన పరిస్థితి దాపురించింది,పోలీస్ స్టేషన్కు ఎవరైనా వెళ్లాలంటే ప్రమాదం పొంచి ఉంది ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్న అసంపూర్తిగా తవ్వి విడిచిపెట్టిన కాలువలో పడిపోయే ప్రమాదం ఉంది ఇప్పటికైనా నగర పంచాయతీ అధికారులు మేల్కోవలసి ఉంది,ఇదే అంశంపై విశాలాంధ్ర కమిషనర్ రత్నరాజుకు చరవాణి ద్వారా అడగగా ఈ విషయమై ఇంజనీరింగ్ అధికారిదేవి ప్రసాద్ వివరణ ఇస్తారని చెప్పారు ఇదే అంశంపై ఏఈ వివరణ ఇస్తూ ఈ కల్వర్టు ఎస్టిమేషన్ లక్ష రూపాయల వరకు అవుతుందని ఎస్టిమేషన్ వేయగా అది కాస్త ఎక్కువ అవ్వడంతో కౌన్సిల్ తీర్మానానికి పెట్టడం జరిగిందని వారం రోజులలో పనులు ప్రారంభిస్తామని బదులు ఇచ్చారు.

20న ఉపాధి కూలీల సమస్యలపై సమ్మెను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - కొయ్యూరు అల్లూరి జిల్లా : ఎంజిఎన్ఆర్ ఈజీఎస్ ఉపాధి కూలీల సమస్యలపై ఈ నెల 20న జరిగే సమ్మెను విజయ వంతం చేయాలని మండల సిఐటియు నాయకులు వై.అప్పలనాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక విలేకరులకు విడుదల చేసిన ప్రకటనలో అప్పలనాయుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీలకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రోజుకు 600 రూపాయలు చెల్లించి ఉపాధి కూలీలు పనిచేసే ప్రాంతంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా 200 రోజుల పని దినాలు కల్పించాలని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి పనిని తొలగించే ఉద్దేశంతో కుట్ర పన్నుతున్నారని ఇప్పటికే ఉపాధి పనులను యంత్రాలతో చేయించడం జరుగు తుందన్నారు. దీంతో ఈ నెల 20న సిఐటియు ఆధ్వర్యంలో జరిగే సమ్మెలో ఉపాధి కూలీలు పాల్గొని విజయవంతం చేయాలని అప్పలనాయుడు పిలుపునిచ్చారు.

సచివాలయాలకు.. సిబ్బంది వేళకు రాక ప్రజలు నిరీక్షణ

అధికార్లు పర్యవేక్షణ లోపమా.. సిబ్బంది నిర్లక్ష్యమా..!

సిబ్బంది అందుబాటులో లేక వెనుదిరుగుతున్న ప్రజలు..

విశాలాంధ్ర - కొయ్యూరు అల్లూరి జిల్లా : సచివాలయాల ద్వారా ప్రజలకు మరింత సేవలను చేరువ చేసేందుకు గత వైయస్సార్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామ వార్డు సచివాలయాల్లో సిబ్బంది విధులకు సకాలంలో రావడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.ఉదయం 10 గంటలలోపుగా రావల్సిన సిబ్బంది 11.10 గంటలు అయినా ఒక్క దవలప్మెంట్ అధికారి తప్పా! బంగారంపేట సచివాలయానికి మంగళవారం మిగతా ఏ ఒక్క సిబ్బంది హాజరు కాకపోవటం పట్ల గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కొయ్యూరు మండలం బంగారంపేట సచివాలయంలోని దాదాపు గత కొంతకాలంగా ఇదే పరిస్థితి ఉందని సర్వత్రా ఆరోపిస్తున్నారు. మండలంలో ని అసలే ప్రభుత్వం వివిధ సర్వేల పేరుతో సచివాలయం సిబ్బందికి విధులు అప్పగించగా వీటిలో అత్యవసరమైన వారిని మినహాయించి మిగిలిన సిబ్బందిని గత రెండు నెలలుగా కేటాయించి పనులు చేయిస్తున్న నేపథ్యంలో మిగిలిన సిబ్బంది స్థానికంగా తమ విధులకు సకాలంలో హాజరు కావాల్సి ఉన్నా ఏ ఒక్కరూ సచివలయలకు రావటంలేదని వీరి పరిస్థితి పై పిర్యాదు చేసినా సంబధిత ఉన్నతాధికార్లు ఏ ఒక్కరూ పర్యటించకనే కొందరు సిబ్బంది తమ విధులకు హాజరుకావటం లేదని స్థానిక కూటమి నాయకులు, ప్రజలు అంటున్నారు. అధిక శాతం సిబ్బంది సర్వేలోనే ఉంటున్నట్టు చెబుతున్నారని అసలు ఎవరు సర్వే చేస్తున్నది! ఎవరూ చెయ్యలేనిది ఇక్కడ ఏ ఒక్కరికి తెలియని పరిస్తితి నెలకిన్నట్టు బంగారంపేట పంచాయితీ లో ప్రజలు ఆరోపిస్తున్నారు. వివిధ పనులపై వస్తున్న ప్రజలకు సమాధానం చెప్పే నాథుడు లేక వచ్చిన వారు గంటల కొలది వేచి ఉండలేక అవస్థలు పడుతున్నట్టు చెబుతున్నారు. బంగారంపేట సచివాలయంలోనే కాక మండలంలో చాలా చచివాలయల్లో ఇదే పరిస్థితి నెలకొన్నట్టు ఆయా గ్రామాల్లో పిర్యాదు లున్నాయి. అధికార్లు సచివాలయంలో తనిఖీలు చేపట్టడం లేక సిబ్బందీ అందుబాటులో ఉండే పరిస్థితి పై తగిన నిర్ణయం చేయాలని లేని పక్షంలో గిరిజన గ్రామాల్లో ప్రజలు మరింత అసంతృప్తి చెందే పరిస్థితి తప్పదని పలువురు కూటమి నాయకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

యూనియన్ బ్యాంక్ మేనేజర్‌గా ప్రసాద్ బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర - అడ్డతీగల : అడ్డతీగల యూనియన్ బ్యాంక్ మేనేజర్‌గా బాధ్యతలు తీసుకున్న బి.ఎస్. సి హెచ్. ప్రసాద్. ఈయన పిఠాపురం మండలం చేబ్రోలు నుండి పదవున్నతపై అడ్డతీగల మేనేజర్ గా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ బాధ్యతలు నిర్వహించిన ఏ రవి కిరణ్ రాజవొమ్మంగి మేనేజర్‌గా బదిలీపై వెళ్లడం జరిగింది ఈయనకు బ్యాంకు సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు.

ప్రభుత్వ ఉత్తర్వులు 20ని వెంటనే సవరించాలి

ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ డిమాండ్

విశాలాంధ్ర - పార్వతీపురం : రాష్ట్ర విద్యా శాఖలో తొమ్మిది రకాల పాఠశాలల ఏర్పాటు అశాస్త్రీయమని, కొత్తగా విడుదల చేసిన ప్రభుత్వ ఉత్తర్వు 20లోని నియమాలు విద్యా హక్కు చట్టం స్ఫూర్తికి భిన్నంగా ఉన్నాయని ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ పార్వతీపురం మన్యం జిల్లా శాఖ తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారు. 117 ఉత్తర్వులకన్నా యీనిబంధనలు దారుణంగా ఉన్నాయన్నారు. ఉపాధ్యాయ సంఘాలతో లెక్కలేనన్ని సమావేశాలు ఏర్పాటు చేసినా వారి సూచనలను వేటినీ పరిగణనలోకి తీసుకోకపోవడం అప్రజాస్వామికమని జిల్లా శాఖ పక్షాన మహేష్, బాలకృష్ణ తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. ఫౌండేషన్ స్కూల్స్ అన్నీ వెంటనే మూతపడే పాఠశాలలే. ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ విద్యార్థుల నిష్పత్తి సహేతుకం కాదు. ప్రస్తుత ఉత్తర్వులు ఉపాధ్యాయులకు పనిభారాన్ని పెంచాలనే లక్ష్యంతోనే రూపొందించబడినట్లు అర్థం అవుతుంది. వీటి ప్రకారం ప్రతి ఉపాధ్యాయుడు కనీసం వారానికి 40 పీరియడ్లకు తక్కువ కాకుండా పని చేయవలసి ఉంటుంది. కొంతమంది ఇంకా ఎక్కువ పీరియడ్స్ కూడా పనిచేయవలసి వస్తుంది. ప్రాథమికోన్నత పాఠశాలలో 140 మంది వరకు నలుగురు స్కూల్ అసిస్టెంట్ మాత్రమే. సబ్జెక్టు టీచర్లు లేకుండా ప్రాథమికోన్నత పాఠశాలలలో బోధన అసాధ్యమనీ,ఈ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని వీరు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలోలాగే తెలుగు మాధ్యమం సంగతి ప్రస్తావించలేదనీ,రెండు మాధ్యమాలు ఉన్న పాఠశాలల్లో మొత్తం విద్యార్థుల సంఖ్యను పరిగణించాలని చెప్పటం ద్వారా పోస్టులను కుదించివేశారన్నారు.విద్యాశాఖమంత్రి జోక్యం చేసుకొని వీటిని సవరించాల్సిందిగా కోరారు.

బయోమెట్రిక్ పరికరాలను వైద్య సిబ్బందికి అందజేసిన డిఎం అండ్ హెచ్ఓ డా. భాస్కరరావు

విశాలాంధ్ర - బెలగాం : సకాలంలో ఆరోగ్య సర్వే లక్ష్యాలు చేరుకోవడంలో బయోమెట్రిక్ పరికరాలను సద్వినియోగం చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు సూచించారు. వైద్యారోగ్యశాఖ జిల్లాకు పంపిణీ చేసిన బయోమెట్రిక్ పరికరాలను మంగళవారం ఆరోగ్య కార్యాలయంలో డిఎంహెచ్ఓ వైద్య సిబ్బందికి అందజేశారు. ఈసందర్భంగా డాక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ ప్రజారోగ్యం దృష్ట్యా వైద్య సిబ్బంది పలు సర్వేలు చేపట్టడం జరుగుచున్నదనీ, ఇందుకు గాను జిల్లాకు 695 బయోమెట్రిక్ పరికరాలను పంపిణీ చేశారని వాటిని అన్ని ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్య సిబ్బందికి అందజేస్తున్నామన్నారు. ఇంటింటి సర్వేలో మరియు ఆరోగ్య కేంద్రాల్లో ప్రతీ ఒక్కరికీ ఆరోగ్య తనిఖీలు చేపట్టి వివరాలు ఆన్లైన్ లో నమోదు చేయాల్సి ఉందని ముఖ్యంగా ఎన్సీడీ సర్వే, ఆర్బిఎస్కె సర్వే, ఇహెచ్ఆర్ నమోదు, ఇందుకు ఓటిపి విధానంలో సిబ్బందికి ఎక్కువ సమయం పడుతుందని, అంతేగాక కొన్ని ప్రాంతాల్లో సిగ్నల్స్ సమస్య, కొంతమందికి ఫోన్లు లేకపోవడం వల్ల వారి ఆరోగ్య వివరాలు నమోదు కొంత క్లిష్టతరంగా ఉండేదన్నారు. ఇప్పుడు అందజేసిన బయోమెట్రిక్ పరికరాలతో వేలి ముద్ర సేకరణ ద్వారా సర్వే మరింత సులభమవుతుందని, సకాలంలో లక్ష్యాలు పూర్తి చేయడానికి దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి. జగన్మోహనరావు, డా. పి.ఎల్ రఘుకుమార్, సిడిఎస్ ఫార్మసిస్ట్ లీలారాణి తదితరులు పాల్గొన్నారు.

మృత్యు సంకటంగా మృత్యుంజయ నగరం రోడ్డు...!

ప్రాణ సంకటంగా అంతర్రాష్ట్ర రహదారి

విశాలాంధ్ర - పార్వతీపురం రూరల్ : మండలంలోని మృత్యుంజయ నగరం (ఎమ్మార్ నగరం) రోడ్డు మృత్యు సంకటంగా మారిందని , అంతర్రాష్ట్ర రహదారి మరి అధ్వానంగా ఎక్కడ కక్కడ గోతులు మయంగా మారాయని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించారు. మంగళ వారం పార్టీ నాయకులు వెంకంపేట శివారు గోలీలు నుండి ఎమ్మార్ నగరం వరకు గల గోతుల మయమైన రోడ్డును పరిశీలించారు. ఒడిశా కోరాపుట్ కు రాకపోకలు సాగించే రహదారి పెద్ద పెద్ద గోతులు ఏర్పడి ప్రాణ సంకటంగా మారిందన్నారు. వెంకంపేట గోరీల నుండి వెంకంపేట గ్రామం వరకు, ఎం ఆర్ నగరం వరకు గల రహదారులు పెద్దపెద్ద గోతులు ఏర్పడి ప్రజల రాకపోకులకు ఇబ్బందులు కలుగుతున్నాయి అన్నారు. పెద్ద పెద్ద గోతుల్లో పడిన వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయన్నారు. పలువురు ప్రయాణికులు ప్రమాద భారిన పడిన సంఘటనలు లేకపోలేదన్నారు. కూటమి పాలకులు కూడా రోడ్డు బాగోగులపై చేతులెత్తేసారన్నారు. ఈ రహదారి గుండా పెద్దపెద్ద నాయకులు, అధికారులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారని, అటువంటివారు కనీసం ఈ రోడ్డు బాగాగులపై దృష్టి పెట్టకపోవడం బాధాకరమన్నారు. ఇక వర్షాలు పడితే రహదారి మొత్తం మరింత చిద్రమయ్యే పరిస్థితి ఉంటుందన్నారు. ఈ రహదారిలో ప్రయాణించే స్థానిక ప్రజలతో పాటు ఒడిశాకు చెందిన ప్రజలు కూడా అధికారుల తీరుకు విస్మయం వ్యక్తం చేస్తున్నారన్నారు. తక్షణమే సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి వెంకంపేట గోరీల నుండి ఎమ్మార్ నగరం వరకు గల గోతుల మయమైన రహదారి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఘనంగా సంసిద్ధత ఉత్సవ్...

విశాలాంధ్ర - వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం ప్రాజెక్టు పెదమట్ట పల్లి సెక్టార్లో గల చిన్న మట్టపల్లి ఎంపీపీ పాఠశాల నందు, హబ్ అంగన్ వాడి కేంద్రంలోనీ పిల్లలకు సంసిద్ధత ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమాన్ని మండల విద్యాశాఖ అధికారి సిహెచ్ బాబురావు, చిన్న మట్టపల్లి పంచాయతీ సర్పంచ్ పిట్ట రామారావు, కూనవరం ప్రాజెక్ట్ అధికారిని శ్రీమతి నాగలక్ష్మి, చిన్నమట్టపల్లి ప్రధానోపాధ్యాయులు ఎస్ నాగేశ్వరరావు, ఐటీసీ ప్రథ మ్ జిల్లా కోఆర్డినేటర్ పవన్, సూపర్వైజర్ పద్మావతి ప్రారంభించారు.వీరు ఈ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన 7 స్టాల్స్ ను పరిశీలించి పిల్లలు యొక్క నైపుణ్యాన్ని తెలుసుకున్నారు పిల్లల నైపుణ్య పత్రాలను తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రీ స్కూల్ విద్య ద్వారానే పిల్ల యొక్క పురోగతి ఉంటుందని, ఈ కార్యక్రమం చాలా మంచిదని పిల్లలి యొక్క నైపుణ్యాన్ని తల్లిదండ్రులకు తెలియపరచడం ద్వారా తమ పిల్లల్ని ఇంకా ఎలా మెరుగుపరుచుకోవాలో ఒక అవగాహన ఉంటుందని అన్నారు జూన్ 12వ తేదీన ప్రథమ తరగతిలో చేరే లోపు ఎటువంటి అభ్యసనలపై దృష్టి పెట్టాలి అనే విషయాలను వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లల అభ్యాసలను స్వయంగా చూసి హర్షం వ్యక్తం చేశారు ఇటువంటి కార్యక్రమాలు చేయడం చాలా బాగుందని అన్నారు. అనంతరం అందరూ కలసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు, గ్రామ పెద్దలు గ్రామస్తులు పాల్గొన్నారు.

పేసా చట్టానికి విరుద్ధంగా పేసా ఎన్నికలు...

విశాలాంధ్ర - అడ్డతీగల : మండలం డి.భీమవరం గ్రామంలో సోమవారం జరిగిన పేసా గ్రామసభ ఎన్నికలు పేసా చట్టానికి విరుద్ధంగా జరిగాయని"ఆదివాసీ సంక్షేమ పరిషత్" (274/16) రంపచోడవరం డివిజన్ అధ్యక్షులు మోడిద. నూకరాజు,పీత ప్రసాద్ లు అన్నారు. పేసా గ్రామసభలో గిరిజనేతరులు కేవలం అభిప్రాయాలూ మాత్రమే చెప్పాలని, అలాగే తమ ఓటు మాత్రమే ఉపయోగించు కోవాలని, కానీ ఓటింగ్ విషయంలో వారు ఒక అభ్యర్థిని నిలబెట్టి వారికి మాత్రమే ఓటు వెయ్యాలని ఇంటింటికి వెళ్లి ప్రోత్సహించి సీక్రెట్ ఓటింగ్ వేయించారని, ఇది చట్ట వ్యతిరేక చర్య అయినప్పటికీ అధికారులు ఖండించకుండా ఈ చర్యను సహకరించటం జరిగిందని ఇందులో గిరిజనేతరుల పెత్తనం ఏంటని వారు ప్రశ్నించారు. పేసా చట్ట ప్రకారం గ్రామసభకు హాజరు అయినవారు చేతులు ఎత్తుట ద్వారా ఎన్నికలు జరుగుతాయని, కానీ పేసా అధికారులు దీనికి భిన్నంగా సీక్రెట్ ఓటింగ్ నిర్వహించడం జరిగిందని, రాజకీయ ప్రమేయం ప్రబలంతోనే ఈ ఎన్నికలు జరిగాయ ని, పేసా అధికారులు ఉద్దేశ్య పూర్వకంగానే పేసా చట్టాన్ని ఉల్లంఘించ్చారని ఈ విషయంపై ఉన్నంతధికారులకు పిర్యాదు చేస్తామని అన్నారు.